

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కాను కల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆది వారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,15,708లు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి విజయం సాధించాలని వక్తలు పిలుపునిచ్చారు.

- 10లో



తుఫాన్‌పై అప్రమత్తం

తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలకు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

- 10లో

న్యూస్‌రీల్

లోయలోకి దూసుకెళ్లిన టిప్పర్



బోల్తా పడిన టిప్పర్

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి బొలదియా గ్రామ సమీపంలో తారు లోడుతో వస్తున్న టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడి లోయలోకి దూసుకుపోయింది. ఆది వారం జరిగిన ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకు న్నారు. టిప్పర్ డ్రైవర్ సురక్షితంగా బయటప డ్డాడు. సికరపాయి నుంచి సెరిగుమ్మ వైపు ఆటో వెళుతుండగా కొరాపుట్ జిల్లా బం ధుగాం నుంచి తారులోడుతో గురుతులికి వెళుతున్న టిప్పర్ ఆటోకు సైడ్ ఇవ్వబోయి అదుపుతప్పి లోయలో పడిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

గుంతలో గున్న ఏనుగు



బురదలో చిక్కుకున్న గున్న ఏనుగు

భువనేశ్వర్: సుందర్‌గఢ్ జిల్లాలోని సాన్ దామ్‌కుడ భాద్రపద సమీపంలోని పొలంలో బురద గుంతలో గున్న ఏనుగు చిక్కుకుంది. సుందర్‌గఢ్ సదర్ అటవీ ప్రాంతంలో శని వారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది ఆదివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ క్రేన్ సహాయంతో సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం అడవిలో నివా సస్థలానికి సురక్షితంగా తరలించారు.


పీసీసీ అధ్యక్షుడికి అభ్యర్థుల జాబితా



పట్నాయక్‌కు జాబితా సమర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు బిజయ్

రాయగడ: రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్య క్షుడు శరత్ పట్నాయక్‌ను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బిజయ్ గొమాంగొ, మరి కొందరు సీనియర్ నాయకులు భువనేశ్వర్‌లో కలిశారు. రాయగడ, బిసంకటక్, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేం దుకు ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల జాబి తాను గొమాంగొ అందజేశారు. గుణుపూర్ నియోజకవర్గం నుంచి అవినాస్ గొమాంగొ, సత్యజీత్ గొమాంగొ, భాస్కర్ జగరంగలు.. బిసంకటక్ నియోజకవర్గం నుంచి నీలమాధవ ఉలక, నీలమాధవ హికక, రాయగడ నియో జకవర్గం నుంచి అప్పలస్వామి కద్రక పేర్లను జాబితాలో పొందుపరిచారు. అయితే గుణు పూర్ నుంచి తాను కూడా పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్న నేపథ్యంలో డీసీసీ అధ్య క్షుడు బిజయ్ గొమాంగొ కూడా పీసీసీ అధ్య క్షుడు శరత్ పట్నాయక్‌తో మంతనాలు జరిపి నట్లు సమాచారం. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బచ్చానిధి బెహర, హృషికేష్ పాత్రొ, డీసీసీ సాధారణ కార్యదర్శి సుధీర్ గురు, తర ణీసేన్ శతపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సాహం



సంబరాల్లో బీజేపీ శ్రేణులు

భువనేశ్వర్: మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంతో స్థానిక బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉత్సవ వాతా వరణం నెలకొంది. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, మాజీ అధ్యక్షుడు సం తోష మహంతి, పలువురు పార్టీ ప్రముఖులు విజయోత్సవంలో పాలుపంచుకున్నారు.

ముగిసిన క్రీడోత్సవం

- గిరిజన యువత క్రీడల్లో మరింత రాణించాలి
- బహుమతుల ప్రదానోత్సవంలో గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి గిరిజన క్రీడోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారునులద్దేశించి ప్రసంగించారు. గిరిజన యువతకు క్రీడలు ఎంతగానో స్ఫూర్తినిచ్చాయని చెప్పారు. జిల్లాలోని ప్రతి సమితిలో ఇన్‌డోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మినీ స్టేడియం ఏర్పాటుకు కూడా కృషి చేస్తామన్నారు.

గిరిజనుల అభివృద్ధికే ఎస్‌డీసీ..

గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్



పోటీలకు హాజరైన క్రీడాకారులు

ఎస్‌డీసీ సంస్థలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌డీసీ రాయగడ చైర్మన్ అనసూయా మాఝి అన్నారు. ఆదివాసీ, ఎస్సీలు నివసిస్తున్న 23 జిల్లాల్లో ఈ సంస్థలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆదివాసీ యువతీ, యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయా మాఝిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. చైర్‌పర్సన్ సహకారంతో క్రీడోత్సవాలు విజయవంతంగా ముగిశాయని చెప్పారు. అనంతరం క్రికెట్ టోర్నీలో కొలనార జట్టు విజేతగా నిలవగా, గుణుపూర్ జట్టు రన్నర్‌గా గెలుచుకుంది. వాలీబాల్ పోటీల్లో రాయగడ జట్టు విజేతగా నిలించింది. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, ఏడీఎం భాస్కర రైతా, గుణుపూర్ ఐటీడీఏ అధికారి శాంతి ప్రభా ప్రధాన్, రాయగడ ఐటీడీఏ అధికారి దిలీప్‌కుమార్ బెహరా, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సమితి అధ్యక్షులు, సర్పంచులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.



ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయా మాఝిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



ఆదివాసీ సంప్రదాయ ఢింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు



సంబల్‌పురి నృత్యం



ఆదివాసీ నృత్యం

పులి కలకలం

- భయంతో చెట్టెక్కిన మహిళ
- రెండు గంటల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపిన వైనం
- పరిశీలించిన అటవీ అధికారులు



వివరాలు తెలుసుకుంటున్న అటవీ శాఖ అధికారులు



పులి సంచరిస్తున్న దృశ్యం

రాయగడ: గజపతి, రాయగడ, కంధమాల్ జిల్లాల్లో కొద్దిరోజులుగా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న పెద్దపులి తాజాగా కంధమల్ సరిహద్దులోని గొటొనొ గ్రామంలో హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన జయంతి జగరంగ అనే మహిళ శనివారం పొలంలో పనులు చేసుకుంటుండగా పులి అరుపు వినపడటంతో చెట్టెక్కింది. కొద్దిసేపటికే ఆ దిశగా పులి వెళ్లడం చూసి తన వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో వీడియో తీసింది. సుమారు అరగంట పాటు చెట్టుపైనే ఉండి ప్రాణాలను కాపాడుకుంది. అనంతరం గ్రామానికి చేరుకుని విషయాన్ని గ్రామస్తులకు చెప్పింది. సమాచారం తెలుసుకున్న మునిగుడ అటవీ శాఖ అధికారులు రెండు బృందాలుగా వీడి వివరాలను సేకరించారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ బయటకురావద్దని సూచించారు. మునిగుడ సమితి బంధుగుడ అడవుల్లో రెండు రోజుల క్రితం పెద్దపులి బర్రెపిల్లను చంపినట్లు అక్కడి వారు చెబుతున్నారు. పులి వీడియో వైరల్ కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రహదారులు రక్తసిక్తం



మయూర్‌భంజ్‌లో నుజ్జయిన ట్రక్

- వేర్వేరు చోట్ల ప్రమాదాలు
- ఇద్దరు దుర్మరణం

భువనేశ్వర్: నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఒకరు మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. స్థానిక చంద్రశేఖర్‌పూర్ పోలీస్ ఠాణా పరిసరాల్లో పెట్రోల్ పంపు సమీపంలో ఆదివారం వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి డివైడర్ మీదుగా వెళ్లి ఎదురుగా ఉన్న బస్సును ఢీకొట్టింది. పటియా నుంచి డొమొణ వైపు కారు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో కారులో నలుగురు ప్రయాణికులు ఉన్నారు. తీవ్రంగా గాయపడి డ్రైవర్ మృతిచెందాడు. బాధితుల్ని చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆసుపత్రిలో చేర్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

మయూర్‌భంజ్‌లో ట్రక్కు బోల్తా..

భువనేశ్వర్: రాష్ట్రంలో శూన్య ప్రాణహాని వారం కొనసాగుతున్న తరుణంలో మరో రోడ్డు ప్రమాదం డ్రైవరు ప్రాణాల్ని బలిగొంది. మయూర్‌భంజ్ జిల్లా బంగిరిపోసి ప్రాంతంలో జాతీయ రహదారిపై రక్షణ గోడను ఇనుప ఖనిజం రవాణా చేస్తున్న ట్రక్కు ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రక్కు డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. 18వ నంబరు జాతీయ రహదారిపై దురాసుని ఘాటీ గుండా వెళుతుండగా ట్రక్కు రక్షణ గోడను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ సహాయకుడికి చికిత్స నిమిత్తం బంగిరిపోసి ఆసుపత్రికి తరలించారు.



చంద్రశేఖర్‌పూర్ ఠాణా పరిధిలో ప్రమాదంలో నుజ్జయిన కారు

అలరించిన ఘంటసాల సంగీత విభావరి



ఘంటసాల చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

పర్లాకిమిడి: ప్రముఖ సినీ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 125వ జయంతి పురస్కరించుకుని స్వరగాన స్మృతి లహరి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక గాయనీగాయకులు ఆదివారం జంగంవీధిలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో సంగీత విభావరి నిర్వహించారు. కార్యదర్శి ఐ.వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి కార్యదర్శి బర్నాల జనార్దనరావు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి ఔత్సాహిక గాయనీ గాయకులు విచ్చేసి ఘంటసాలను స్మరిస్తూ మధుర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో స్వరగాన స్మృతి లహరి సభ్యులు కె.చిరంజీవి, గాయనీ గాయకులు రేణుక, శుభాకర్, మురళీ బెహరా, సుభద్ర, సత్యనారాయణ పండా, ఆర్.ఖగేశ్వరరావు, టి.కిషోర్‌కుమార్, కె.చిరంజీవులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పాటలు పాడుతున్న శుభాకర్, రేణుక

మృత్యుంజయుడికి స్వాగతం



భగవాన్ భొత్రకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

జయపురం: ఇటీవల ఉత్తర కాశీ సిల్కియార టన్నెల్‌లో చిక్కుచకుని ఎట్టకేలకు బయటపడిన 41 మంది కార్మికుల్లో ఒకడైన నవరంగపూర్ జిల్లా డాబుగాం సమితి తాలబెడ గ్రామానికి భగవాన్ భొత్రకు అపూర్వ స్వాగతం లభించింది. డాబుగాం ఎమ్మెల్యే మనోహర రొంధారి, నవరంగపూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమళలోచన మిశ్రాలు ఆదివారం పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. సొరంగంలో చిక్కుకున్న 17 రోజుల తర్వాత మృత్యుంజయుడిగా బయటకు రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భగవాన్ మాట్లాడుతూ 17 రోజుల పాటు రాత్రిపగలు అనే తేడా తెలియకుండా అంధకారంలో బతికామని, ప్రాణాలు నిలబెట్టుకునేందుకు కెమికల్ నీరు తాగాల్సి వచ్చిందని వివరించాడు.

పాత బరంపురంలో ఆక్రమణల తొలగింపు



జొగబందు వీధిలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం



పోలీసులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

బరంపురం : బరంపురం అభివృద్ధి సంస్థ, మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 9వ వార్డు పాత బరంపురంలో జొగబంధు, లక్ష్మినరసింహ వీధిలో ఆక్రమణలు తొలగించారు. ఇళ్లు, పలు దుకాణాలను జేసీబీలతో తొలగించారు. ఈ సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ సహకారంతో పోలీసులు పర్యవేక్షించారు. అయినప్పటికీ స్థానికులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. 20 ఏళ్లుగా ఇక్కడే నివాసముంటున్న తమను రోడ్డున పడేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, అధికారులు సర్ది చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

మావోయిస్టుల హింసాకాండ



రోడ్డును తవ్వేసిన దృశ్యం

- ఇన్‌ఫార్మర్ నెపంతో సర్పంచ్ హత్య
- సెల్‌టవర్ దగ్ధం

జయపురం: పీపుల్స్ లిబరేషన్ గ్రూపు ఆర్మీ వారోత్సవాల సందర్భంగా అవిభక్త కొరాపుట్ సరిహద్దులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. కంగారు జిల్లాలో నాయిబ్ సర్పంచ్‌ను హత్య చేశారు. సెల్‌టవర్‌ను దగ్ధం చేశారు. రోడ్డును తవ్వి రాకపోకలకు అంతరాయం కలిగించారు. అదే ప్రాంతంలో లేఖను విడిచిపెట్టారు. ఇదే జిల్లాలో ఛొటెబెటియ, బందే పోలీసుస్టేషన్ల ప్రాంతాల్లో పెద్ద ఎత్తు హింసాకాండకు పాల్పడినట్లు సమాచారం. కందాడి గ్రామ పంచాయతీ నాయబ్ సర్పంచ్ రామసు కచలామిని మావోయిస్టులు ప్రజా కోర్టులో మరణదండ విధించారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడం వల్లే హత్య చేసినట్లు పోస్టర్‌లో పేర్కొన్నారు. తాజా ఘటనలతో పోలీసులు అప్రమత్తమై భద్రతా చర్యలు చేపట్టారు.



దగ్ధమైన సెల్‌టవర్



మావోయిస్టుల విడిచిన లేఖ

క్లుప్తంగా

తెలంగాణ ఫలితాలే ఒడిశాలో పునరావృతం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్

భువనేశ్వర్: రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో భారతీయ జనతా పార్టీ విజయానికి డబ్బు బలమే కారణమని ఆరోపించిన కాంగ్రెస్.. తెలంగాణలో మాదిరిగానే ఒడిశాలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంటుందని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత, జట్నీ నియోజకవర్గ ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిశాలో విజయం సాధించేందుకు 2024 ఎన్నికలకు పార్టీ సిద్ధమవుతోందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ అనుసరించిన వ్యూహాన్నే ఒడిశాలో అనుసరిస్తామని చెప్పారు. దీనిలో భాగంగా ఈ నెలాఖరులో భువనేశ్వర్‌లో పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఇద్దరూ హాజరవుతారని భావిస్తున్నామని తెలిపారు. రైతులు, మహిళలు, గిరిజన సంఘాల సభ్యులతో సహా రెండు లక్షల మందికి పైగా ప్రజలు హాజరవుతారని చెప్పారు. వచ్చే ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ బిజు జనతా దళ్ (బీజేడీ), కాంగ్రెస్ మధ్య ఉంటుందని ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్ తెలిపారు. పెరుగుతున్న నిరుద్యోగం, రైతుల సమస్యలు, అవినీతి, పెచ్చుమీరుతున్న నేరాలు, క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితిలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కాంగ్రెస్ సామూహిక ప్రజా సంప్రదింపులు కార్యక్రమం ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందన్నారు.

తాబేళ్లను సంరక్షించుకుందాం


మాట్లాడుతున్న ఆర్‌సీసీఎఫ్ సురేష్ పంత్

బరంపురం : గంజాం జిల్లా రుశికుల్య నది సముద్ర ముఖద్వారంలో సంతాన అభివృద్ధి కోసం వస్తున్న అరుదైన తాబేళ్లను సంరక్షించుకుందామని ఆర్‌సీసీఎఫ్ సురేష్ పంత్ కోరారు. శనివారం డివిజనల్ చీఫ్ కంజర్‌వేటర్ ఫారెస్ట్ సమావేశ మందిరంలో బరంపురం అటవీ విభాగం ఆధ్వర్యంలో సర్కిల్ స్థాయి ఎన్‌జీఓ, సీబీఓ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి అముల్య కుమార ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నియంత్రిద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న సిటీ స్కూలు విద్యార్థులు

జయపురం: కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జయపురం సిటీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సైక్లింగ్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో 50 మందికి పైగా విద్యార్థులు, సీవా సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు ఉత్సవాలకు 'కుత్తుం'

పలాస: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 16, 17వ తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహిత్య -కళా ఉత్సవాల్లో పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన వాగ్గేయకారుడు కుత్తుం వినోద్ పాల్గొనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రోగ్రాం కన్వీనరు కొల్లి రమావతి నుంచి ఆహ్వానం అందినట్టు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో తనను భాగస్వామిని చేసినందుకు వినోద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు


బహుమతులు పొందిన ప్రయాణికులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం 1, 2వ డిపోల నుంచి వివిధ మార్గాల్లో ప్రయాణించే వ్యక్తులకు గిఫ్ట్ స్కీమ్ కింద ఆదివారం బహుమతులు అందజేశారు. నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు రెండు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఆమదాలవలస, చీపురుపల్లి, బందరువానిపేట, సాలూరు, విజయనగరం, జీకే వలస, యరగాం, శ్రీముఖలింగం రూట్లలో ప్రయాణం చేసిన వారికి డ్రా తీశారు. వీరిలో శ్రీనివాసరావు, రామకృష్ణ, తరంగిణి, సుష్మిత, చందు, చిన్నా, సాయికిరణ్, హృదయ నందన్ తేజేశ్వరి, హర్ష, సూర్యకుమారి, జగదీష్, అప్పలరాజు, శకరరావు, హేమలతలు గెలవగా వారికి బహుమతులు అందజేశారు.


గురు జయరామారావు బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన



రంజన గౌహార్ బృందం ఒడిస్సీ శాస్త్రీయ నృత్య భంగిమలు


అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

నృత్యోత్సవం.. మంత్రముగ్ధం

కోణార్క్ ఫెస్టివల్-2023 రెండో రోజు ఒడిస్సీ, కూచిపూడి శాస్త్రీయ నాటక నృత్య రూపకాలు అదరహో అనిపించాయి. న్యూఢిల్లీ కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన గురు జయరామారావు బృందం ఓంకారం, దశావతారం, దురా తరంగం నృత్యాల్ని ప్రదర్శించింది. న్యూఢిల్లీ ఉత్సవ్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ సొసైటీ తరఫున రంజన గౌహార్ బృందం చేసిన ఒడిస్సీ ప్రదర్శన ప్రేక్షకుల్ని మంత్రముగ్ధం చేసింది. గురు రంజన గౌహార్ నృత్య దర్శకత్వంలో ఒడిశా ఆలయ శిల్పాల అందాలలు, శివుని స్తుతిస్తూ నిర్వహించిన నందికేశ్వరుని 'అభినయ దర్పణం' అలరించింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సునీల్‌కుమార్ బన్సాల్ తదితరులు పాల్గొన్నారు.

-భువనేశ్వర్


ఆకట్టుకున్న అభినయం

తుఫాన్‌పై అప్రమత్తం


పర్లాకిమిడి: సమావేశంలో చర్చిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారి దాని ప్రభావంతో గజపతి జిల్లాలో ఈ నెల 4 నుంచి 6 వరకూ వర్షాలు కురిసే అవకాశముందని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. మిచాంగ్ తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు కోసిన వరి పంట, రాగులను సురక్షిత ప్రాంతాలకి తరలించాలని సూచించారు. కాశీనగర్ ఎన్‌ఏసీ వంశధార ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాశీనగర్, గుమ్మా ప్రాంతంలో నివశిస్తున్న వారిని తుపాను షెల్టర్లుకు తరలించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, ఏడీఎం రాజేంద్రమింజ్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం

భువనేశ్వర్: నైరుతి బంగాళా ఖాతంలో ఏర్పడిన 'మైచాంగ్' తుపాను సోమవారం ఉదయం 5 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఆదివారం సాయంత్రం ప్రకటించింది. దీని ప్రభావంతో గరిష్ఠంగా గంటకు 90 నుంచి 100 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. తుఫాన్ నేపథ్యంలో ఒడిశాలోని అన్ని ఓడరేవులకు 2వ నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. రానున్న మూడు రోజులు మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, గజపతి, గంజాం జిల్లాల్లో కొన్ని చోట్ల, నవరంగ్‌పూర్, కలహండి, కంధమల్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని పేర్కొన్నారు.

అవినీతిని అంతం చేద్దాం


వేదికపై కాంగ్రెస్ నాయకులు

జయపురం: అవినీతిని అంతమొందించి నూతన ఒడిశాను నిర్మిద్దామని జయపురం ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత తారాప్రసాద్ బాహిణీపతి పిలుపునిచ్చారు. జయపురం విక్రమ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అవినీతి, అక్రమాల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. నూతన ఒడిశా నిర్మాణానికి ప్రతిఒక్కరూ కలిసిరావాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సనఖెముడి ఎమ్మెల్యే రమేష్ జెన, అహిరాజ్ మోహణ పాణిగ్రహి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంజిత్ పాత్రో, రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ అధ్యక్షుడు యశిర్ నవాజ్, పీసీసీ సాధారణ కార్యదర్శి మీనాక్షి బాహిణీపతి తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

పంట పరిహారం అందజేయాలని వినతి


తహశీల్దార్‌ను కలిసిన రైతులు

జయపురం: కొట్‌పాడ్ సమితి మారుమూల గ్రామాలైన కొత్రాగుడ, నువాగుడ, కాకటిగుడ, ఫోట్‌కుకింబి, లొకొటిగుడ, కొసిగుడ గ్రామాల పరిధిలో వర్షాభావంతో పంటలు ఎండిపోవడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహశీల్దార్ ముదులిని ఆదివారం కలిసి సమస్య వివరించారు. కరువు ప్రాంతాలుగా ప్రకటించి ఆదుకోవాలని కోరారు.

కార్యక్రమంలో కొట్‌పాడ్ యువ కాంగ్రెస్ సంఘటన కేత రంజన్‌కుమార్ పట్నాయక్, వార్డు సభ్యులు రామ భూమియ, మా మవుసీ యువజన సంఘం అధ్యక్షుడు ఉదయ దురువ, కార్యదర్శి రామ దురువ, జగన్నాథ్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని రైళ్లు రద్దు

భువనేశ్వర్: మైచాంగ్ తుపాను నేపథ్యంలో విపత్తు ప్రభావాల నిర్వహణకు ఈస్ట్ కోస్ట్ రైల్వే (ఈకోర్) జోన్ పరిధిలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. రవాణా, రైల్వే పట్టాల సత్వర పునరుద్ధరణకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విశాఖ, ఖుర్దా రోడ్డు, సంబల్‌పూర్ ప్రధాన కార్యాలయాల్లో ప్రత్యేక సెల్ ప్రారంభించారు. భువనేశ్వర్‌లో హెల్ప్‌లైన్ నంబర్లు 0674 – 2301525, 2301626, 2303060 అందుబాటులోకి తీసుకొచ్చారు. కాగా, తుఫాన్ నేపథ్యంలో శనివారం ప్రకటించిన రైళ్లతో పాటు మరికొన్ని రైలు సేవలు రద్దు చేసినట్లు ఆదివారం ప్రకటించారు. తిరుపతి – బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్(3వ తేదీ), బిలాస్‌పూర్ – తిరుపతి(5వ తేదీ), తిరుపతి– పూరీ ఎక్స్‌ప్రెస్(4వ తేదీ), పూరీ– తిరుపతి(6వ తేదీ), బెంగళూరు–గౌహతి(6, 7వ తేదీలు), ఎర్నాకులం – టాటా ఎక్స్‌ప్రెస్(6వ తేదీ)లు రద్దు చేశారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి


భువనేశ్వర్: సీఎం నవీన్‌తో దివ్యాంగ్ ట్రస్ట్ సభ్యులు

- ఏడీఎం రాజేంద్ర మింజ్
- ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


రాయగడ: ప్రసంగిస్తున్న మంత్రి సరక


పర్లాకిమిడి: ఆకట్టుకున్న ప్రదర్శన


పర్లాకిమిడి: ర్యాలీ ప్రారంభిస్తున్న ఏడీఎం రాజేంద్ర మింజ్

పర్లాకిమిడి: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఏడీఎం రాజేంద్రమింజ్ పిలుపునిచ్చారు. ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పర్లాకిమిడిలోని మహారాజా బాలుర ఉన్నత పాఠశాల వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు, ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమర్థ్ దివ్యాంగుల పునరావాస కేంద్రం అధ్యక్షుడు సంతోష్ మహారాణా, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, అదనపు పీహెచ్‌ఓ డాక్టర్ మహమ్మద్ అలీ, ప్రభుత్వ సామాజిక సురక్షా అధికారి సంతోష్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సాధికారత బలోపేతం

భువనేశ్వర్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఒడిశా దివ్యాంగ్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ వలంటీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ట్రస్ట్ సభ్యులు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను ఆదివారం నవీన్ నివాస్‌లో కలిశారు. 5టీ ఛైర్మన్ వి. కె. పాండియన్ కూడా ఉన్నారు.

జయపురం: దివ్యాంగులకు చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారని వక్తలు పేర్కొన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం సమితి బరణిపుట్ గ్రామ పంచాయతీ ముండిగుడ గ్రామంలో దివ్యాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెనా, డిప్యూటీ న్యాయ సేవా పరామర్శదాత కె.దివాకరరావు, హరిశ్చంద్ర ముదులి తదితరులు పాల్గొన్నారు. జయపురం సోషియల్ ఎడ్యుకేషనల్ ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్ (సీవా) ఆధ్వర్యంలో చైతన్యర్యాలీ నిర్వహించారు. సీవా మాజీ కార్యదర్శి ప్రతాప్ పట్నాయక్, కె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక బిజు పట్నాయక్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖమంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ట్రైసైకిల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ తదితరులు పాల్గొన్నారు.

జయపురం: జయపురం సిటీ ఉన్నత పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ముందుగా దివ్యాంగుల సచేతన ర్యాలీ నిర్వహించారు. జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చంద్రకుమార్ నాయిక్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.


పర్లాకిమిడి: బహుమతి అందుకుంటున్న రూపాలీ శోబోరో


జయపురం: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


జయపురంముండిగుడలో న్యాయసదస్సులో మాట్లాడుతున్న సుమన్ జెనా


జయపురం: సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సీవా కార్యకర్తలు


రాయగడ: ట్రై సైకిల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు


జయపురం: పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

క్లుప్తంగా

సర్వజన ఆస్పత్రిలో కార్నియా సేకరణ



కార్నియా సేకరిస్తున్న టెక్నీషియన్ శ్రీను

విజయనగరం ఫోర్ట్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ ఐ డోనేషన్ సెంటర్ సిబ్బంది కార్నియాను సేకరించారు. వివరాల్లోకి వెళ్తే.. గంట్యాడ గ్రామానికి చెందిన బి.గణపతిరావు(24) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతని కార్నియాను సేకరించాలని రెడ్‌క్రాస్ ఐ డోనేషన్ సెంటర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఈ మేరకు ఐ డోనేషన్ సెంటర్ ఆప్తాల్మిక్ టెక్నీషియన్ ఎ.శ్రీను సర్వజన ఆస్పత్రి మార్చురీలో కార్నియాను సేకరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి కేఆర్‌డీ ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా నేత్ర దానం గొప్పది అన్నారు. ఒక వ్యక్తి నేత్ర దానం ఇద్దరికి చూపునిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మరణాంతరం నేత్ర దానానికి ముందుకు రావాలని కోరారు.

ప్రశాంతంగా జాతీయ ఉపకార వేతన పరీక్ష



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి

విజయనగరం అర్బన్: 2023–24 విద్యా సంవత్సరానికిగాను జాతీయ ఉపకార వేతన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 4,338 మందిలో 4,210 మంది పరీక్షకు హాజరయ్యారని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. పరీక్షల నిర్వహణ పర్యవేక్షణలో భాగంగా డీఈఓ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించాయి.

15 కోళ్లు చోరీ



కోళ్లు దొంగిలించిన ఫారం ఇదే

బలిజిపేట: బలిజిపేట–పెదపెంకి మార్గంలో ఉన్న డైరీ ఫారం వద్ద పెంచుకుంటున్న 15జాతి కోళ్లను ఎవరో దొంగిలించారని యజమాని డి.శ్రావణ్‌కుమార్ తెలిపాడు. చోరీకి గురైనవి సుమారు రూ.15వేల విలువైన జాతికోళ్లు అని చెప్పాడు. పెదపెంకి మార్గంలో సత్రమాను చెట్టువద్ద పాలడైరీ నిర్వహించుకుంటూ అక్కడే జాతికోళ్లను పెంచుకుంటున్నానని, రోజూ లాగానే ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి 15కోళ్లు లేవని, ఈ విషయం పోలీసులకు తెలియజేశానన్నాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గణపతిరావు మృతదేహం

గంట్యాడ: మండల కేంద్రానికి చెందిన బి.గణపతిరావు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. ఆదివారం తెల్ల వారుజామున 3:30 గంటల ప్రాంతంలో కాలకృత్యాలు తీసుకోవడానికి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన గణపతిరావును చికిత్స నిమిత్తం స్థానికులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

పాముకాటుతో వ్యక్తి..

జామి: మండలంలోని అలమండ గ్రామానికి చెందిన రొంగలి రమేష్(47) గత నెల 26వ తేదీన పొలంలో వరిచేను కోస్తున్న సమయంలో పాటుకాటుకు గురవడంతో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సిఫారసు మేరకు విశాఖ కేజీహెచ్‌కు, అమెరికన్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై హెచ్‌సీ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

కొట్లాటపై కేసు నమోదు

భోగాపురం: ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన కొట్లాటపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తవుడు తెలిపారు. దీనిపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన సరగడ సన్నిబాబు, సన్నిరాజు అన్నదమ్ములు. వారి 5 సెంట్ల స్థలం కోసం వివాదం తలెత్తింది. ఈ వివాదంలో అన్న సన్నిబాబు కర్ర తీసుకుని తమ్ముడు సన్నిరాజు తలపై కొట్టడంతో ఆస్పత్రి పాలయ్యాడు. బాధితుడు సన్నిరాజు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

లైసెన్స్ లేకుండా మెడికల్ షాపులు..!

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి మందుల విక్రయం



మందుల దుకాణం

విజయనగరం ఫోర్ట్: తెర్లాం మండలంలో ఓ వ్యక్తి లైసెన్స్ లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఔషధ నియంత్రణశాఖ (డ్రగ్ కంట్రోల్) అధికారులు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

☛ విజయనగరం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఒడిశా నుంచి రహస్యంగా మందులు తెచ్చి లైసెన్స్ లేకుండా ఇక్కడ విక్రయిస్తున్నట్టు ఔషధ నియంత్రణశాఖ అధికారులకు సమాచారం రావడంతో అధికారులు విచారణ చేస్తున్నారు.

☛ మందుల వ్యాపారం లాభదాయకంగా ఉండడంతో కొంత మంది ధనార్జన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. దీని వల్ల ప్రభుత్వ రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. జిల్లాలో మందుల దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వాటిలో కొన్ని లైసెన్స్ తీసుకుని పెడుతుంటే మరి కొంత మంది ఎటువంటి లైసెన్స్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారు. దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందాన వ్యవహరిస్తున్నారు. లైసెన్స్ తీసుకుని షాపు పెట్టి మందులు విక్రయిస్తే ప్రభుత్వానికి పన్ను కట్టాల్సి వస్తుంది. అదే లైసెన్స్ తీసుకోకపోతే ఎటువంటి ఫీజులు, పన్నులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. మందులు విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయం పూర్తిగా పొందవచ్చననే భావనతో కొంతమంది వ్యాపారులు వ్యవహరిస్తున్నారు. లైసెన్స్ తీసుకున్న మందుల దుకాణాలు 800 వరకు జిల్లాలో ఉంటాయి.

తెలియని మందుల నాణ్యత

లైసెన్స్ లేకుండా విక్రయించే మందులు నాణ్యమైనవో కాదో తెలియని పరిస్థితి. లైసెన్స్ ఉన్న మందుల దుకాణాలైతే ఔషధ నియంత్రణ అధికారులు శాంపిల్స్ సేకరించి వాటి నాణ్యతను నిర్ధారించడానికి విజయవాడ ల్యాబొరేటరీకి పంపిస్తారు. లైసెన్స్ లేకుండా విక్రయించే వారి దగ్గర మందుల శాంపిల్స్ సేకరించడం కుదరదు. నాణ్యత లేని మందులు వేసుకోవడం వల్ల రోగుల ఆరోగ్య పై ప్రభావం చూపి ప్రాణం మీదికి వస్తుంది.

లైసెన్స్ లేకుండా విక్రయం కూడదు



లైసెన్స్ లేకుండా మందులు విక్రయించకూడదు. అలా మందులు విక్రయించిన వారిపై ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లాలో ఎక్కడైనా లైసెన్స్ లేకుండా మందులు విక్రయించినా, మందులు నిల్వ చేసినా ఫిర్యాదు చేయాలి. నాణ్యత లేని మందులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– రజిత, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

చేపల వేటకు వెళ్లవద్దు..



చింతపల్లిలో మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేస్తున్న తహసీల్దార్ తదితరులు

పూసపాటిరేగ: తీరప్రాంత మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ ఇ.భాస్కరరావు సూచించారు. మండలంలోని చింతపల్లిరేవును ఆదివా రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో వేట తగదన్నారు. అనంతరం పతివాడబర్రిపేట, తిప్పలవలస రేవులో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఆయనతో పాటు చింతపపల్లి మెరైన్ సీఐ వైకుంఠరావు, భోగాపురం సీఐ విజయ్‌కుమార్, తదితరులున్నారు.

ఆందోళనలో అన్నదాత

డెంకాడ: వరుసుగా వస్తున్న అల్పపీడనాలు, తుఫాన్‌లు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట కోత దశలో ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులను దాటుకుని పండి న పంటను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కోత కోసిన పంటను పొలా ల్లోనే కుప్పలుగా పెడుతున్నారు. ఇంకా కొన్ని చోట్ల కోతలు పూర్తి చేయలేదు. తుఫాన్ ప్రభావంతో వర్షా లు పడితే తమ పరిస్థితి ఏమిటని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉంటే వరి పంటను ఎలా కాపాడుకోవాలో వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పిస్తున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి.. ప్లీజ్..



జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద భయంతో ఇద్దరేసి జట్టు పట్టుకుని మరీ రోడ్డు దాటుతున్న విద్యార్థులు

రామభద్రపురం: మండల కేంద్రం అంతర్ రాష్ట్ర కూడలి కావడంతో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరిగిపోతోంది. దీంతో పాఠశాలల వద్ద రోడ్డు దాటేందుకు విద్యార్థులు తీవ్రంగా భయపడుతున్నారు. రోడ్డుపై ఏ విధమైన వేగ నియంత్రణ సూచికలు లేకపోవడంతో వాహన చోదకులు తగ్గేదేలే అంటూ అతి వేగంగా వాహనాలు నడుపుతున్నారు. పాఠశాలకు వచ్చినపుడు, పాఠశాల విడిచిపెట్టిన తర్వాత విద్యార్థులు రోడ్డు దాటాలంటే ఇద్దరు లేక ముగ్గురు జట్టు పట్టుకుని మరీ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఎప్పుడు ఏ వాహనం స్పీడ్‌గా వస్తుందో లేదో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఎటువంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని, పాఠశాలల వద్ద తప్పనిసరిగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 40 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

- ఈ నెల 8 నుంచి జిల్లాలో నిర్వహణ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక ఆదివారం పూర్తయింది. ఈ మేరకు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జి స్టేడియం ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 100 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. వారికి సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల్లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరిచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో సబ్ జూనియర్ విభాగంలో 18 మంది, క్యాడెట్ విభాగంలో 22 మంది క్రీడాకారులు ఉన్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య శిక్షకుడు డీవీ చారి ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 9 10వ తేదీలలో విజయనగరంలోని ఇండోర్ స్టేడియంలో 10వ సబ్ జూనియర్, 9వ క్యాడెట్ విభాగాల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్ఆర్ సీపీ విజయనగరం పార్లమెంట్ జిల్లా సెక్రటరీ ముద్దాడ మధు, బీసీ సంఘం అధ్యక్షురాలు గదుల సత్యలత మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర , జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు కోచ్‌లు, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


యువకుడి ఆత్మహత్యాయత్నం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని పి.ఆమిటి గ్రామానికి చెందిన ఆరిక సంపత్ ఆదివారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొలం పనులు ముగించుకుని ఇంటికొచ్చిన తల్లి అపస్మారక స్థితిలో ఇంట్లో పడి ఉన్న కుమారుడ్ని చూసి, తక్షణ సపర్యలు చేసి, కుటుంబసభ్యుల సాయంతో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చింది. ప్రథమ చికిత్స అందించిన అనంతరం వైద్యుల సూచన మేరకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. సంపత్ ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

ట్రైసైకిళ్ల పంపిణీ

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్రై సైకిళ్లు, పలు ఉపకరణాలను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, విప్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేర్చుకున్న విద్యను పదుగురికి పంచాలి



జలాసనంలో ప్రముఖ జలాసన నిపుణుడు సుబ్బారావు, యోగా గురువు విజయలక్ష్మి

శృంగవరపుకోట: నేర్చుకున్న విద్యను పది మందికి నేర్పి పంచినప్పుడు సార్థకత చేకూరుతుందని ప్రముఖ జలాసన నిపుణుడు సుబ్బారావు, యోగా గురువు విజయలక్ష్మి అన్నారు. ఇందుకూరి రిసార్ట్‌లో 150 మందికి నీటిపై తేలియాడే విద్యపై ఆదివారం శిక్షణ ఇచ్చారు. పలువురికి అవగాహన కల్పించారు. నీటిలో జలాసనం వల్ల కలిగే ఆరోగ్య అంశాలను వివరించారు. అనంతరం కృష్ణ మహంతిపురం పీఏసీఎస్ అధ్యక్షుడు ఇందుకూరు రామరాజు, పీఆర్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు అశోక్‌రాజు తదితరులు సుబ్బారావు, విజయలక్ష్మిలను సత్కరించారు.

పార్క్‌లో సందర్శకుల సందడి



పార్కులో సందర్శకులు

గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు కుడిమట్టికట్ట పరిసరాలలో ఉన్న ఐటీడీఏ పార్క్ సందర్శకులతో సందడిగా మారింది. పాఠశాలలకు ఆదివారం సెలవు కావడంతో చిన్నారులతో కలిసి తల్లిదండ్రులు పార్క్‌కు వచ్చి ఆనందంగా గడిపారు. జంప్ బాల్స్, జారుడు బల్ల, ఊయల తదితర ఆటలను చిన్నారులు ఆడారు. పార్క్ సమీపంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌లో ఐస్‌క్రీంతో పాటు ఇతర తినుబండారాలను తిని ఉత్సాహంగా గడిపారు. పార్క్‌లో ఉన్న విగ్రహాలు సందర్శకులకు ఆకర్షణీయంగా నిలిచాయి.

విషణ్ణవదనాలతో అక్టోపస్ కానిస్టేబుల్ అంత్యక్రియలు



సోమేశ్వరరావుకు సెల్యూట్ చేస్తున్న డీఎస్పీ

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామానికి చెందిన అక్టోపస్ కానిస్టేబుల్ గురుగుబెల్లి సోమేశ్వర రావు(33) అంత్యక్రియలు విషణ్ణవదనాలతో ఆదివారం జరిగాయి. 16వ బెటాలియన్‌కు చెందిన ఆయన డిప్యుటేషన్‌పై అక్టోపస్ కానిస్టేబుల్‌గా విజయవాడలో పనిచేస్తున్నారు. శనివారం అక్కడ జరిగిన 10కే రన్‌లో పాల్గొని గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోగానే మృతిచెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న తల్లి లక్ష్మి, భార్య వెంకటలక్ష్మి దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఆయనకు 2 సంవత్సరాల కుమార్తె శరణ్య ఉంది. ఆయన తండ్రి చంద్రినాయుడు గతంలోనే చనిపోయారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని ఆదివారం వాల్తేరు తీసుకురాగా, 16వ బెటాలియన్ పోలీసులు గ్రామానికి చేరుకుని గౌరవవందనం సమర్పించారు. డీఎస్పీ శ్రీనివాసచక్రవర్తి, రాజాం సీఐ రవికుమార్, సంతకవిటి ఎస్సై లోకేశ్వరరావు, తదితరులు సోమేశ్వర రావు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

37 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్



గంజాయి నిందితులతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు

విజయనగరం క్రైమ్: పశ్చిమబెంగాల్‌కు చెందిన మాజిబర్ రెహమాన్, సర్దార్‌లు గంజాయి తరలిస్తుండగా ఎస్ఈబీ సిబ్బంది అరెస్ట్ చేసి 37కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఈబీ విజయనగరం–1 బి.మధుకుమార్ మాట్లాడుతూ ఆదివారం రాత్రి సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్ రోడ్డులో పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో వారిని పట్టుకుని, విచారణ చేశామని చెప్పారు. ఈ క్రమంలో వారి దగ్గర ఉన్న నాలుగు బ్యాగ్‌లలో 37 కిలోల బరువు కలిగిన 21 గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిద్దరి మొబైల్స్ సీజ్ చేసి, అరెస్ట్ చేశామని చెప్పారు. పట్టుకున్న గంజాయి విలువ మార్కెట్ ప్రకారం సుమారు రూ. 2 లక్షల ఉంటుందని తెలిపారు. గంజాయిని ఒడిశా నుంచి తమిళనాడుకు తీసుకుని వెళ్తుండగా నిందితులు విచారణలో అంగీకరించారన్నారు. దాడుల్లో ఎస్సై జాన్‌ప్రసాద్, హెచ్‌సీ ధనరాజు, వెంకటరమణ, గంగాధర్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారాది వంతెన నిర్మాణానికి రంగం సిద్ధం



పారాది వంతెన వద్ద అప్రోచ్ నిర్మించేందుకు సిద్ధం చేసిన మెటీరియల్, యంత్రాలు

- వారం రోజుల్లో అప్రోచ్ రోడ్డు పనులు ప్రారంభించనున్న అధికారులు
- రూ.10.90 కోట్ల నుంచి రూ.13.80 కోట్లకు అంచనాలు పెంచి ప్రతిపాదనలు

బొబ్బిలి: పారాది వంతెన నిర్మాణానికి ముందస్తు పనులు ప్రారంభించనున్నారు. ఇందుకోసం ముందుగా నది గుండా అప్రోచ్ రోడ్డు నిర్మాణం ప్రారంభం కానుంది. ఇప్పటికే మెటీరియల్‌ను కాంట్రాక్టర్ ద్వారా వేయించారు. మరో వారం రోజుల్లో దాని నిర్మాణం ప్రారంభించనున్నారు. పారాది వంతెనకు ఇప్పటికే రూ.10.90 కోట్లు మంజూరు చేశారు. పాత వంతెనపై రాకపోకలు సాగిస్తూ నిర్మాణం చేద్దామనుకున్నారు. అయితే వంతెన హఠాత్తుగా పాడవడంతో మరమ్మతులు చేయించి లైట్ వెహికల్స్‌కు మాత్రమే అనుమతిస్తూ మిగతా వాటిని బాడంగి, తెర్లాం మీదుగా ప్రస్తుతం డైవర్ట్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం వంతెన నిర్మాణాన్ని ప్రారంభిస్తే అప్రోచ్ రోడ్డు తప్పనిసరిగా వేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ అప్రోచ్ రోడ్డును గతంలో వంతెన మరమ్మతులప్పుడు వేసినట్టు కాకుండా ధృడంగా వేసి పెద్ద వెహికల్స్‌ను కూడా అనుమతించాల్సి ఉంటుంది. అందుకనే ఇప్పుడు ధృడమయిన అప్రోచ్ రోడ్డును పారాది వేగావతి నదికి అడ్డంగా నిర్మించనున్నారు. రెండు రోజులుగా వాహనాలు, యంత్ర సామగ్రి, మెటీరియల్‌ను చేరవేశారు. వాహనాలన్నింటినీ అనుమతించేందుకు అప్రోచ్ రోడ్డును ధృడంగా నిర్మించనున్నామని, వచ్చే వారం నుంచి అప్రోచ్ రోడ్డును వేగావతి నదిలో నిర్మిస్తామని ఆర్ అండ్‌బీ బొబ్బిలి ఏఈ బీఏకే రాజు 'సాక్షి'కి తెలిపారు.



తరలిస్తున్న గ్రావెల్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ నాగలక్ష్మి



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఎల్‌ఓలకు వివరాలు అడుగుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: బీఎల్‌ఓలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. ఓటర్ల నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా రాజాంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓల వద్ద చేర్పులు, మార్పులు, మరణించిన వారి ఓట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి పొంతన లేని సమాధానాలు చెప్పడంతో బీఎల్‌ఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదు చేసినంత వరకు బీఎల్‌ఓలు ఏం చేస్తున్నారని, నెల రోజులైనా నిర్లక్ష్యం వహించడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇంటింటికి వెళ్లి పూర్తి స్థాయిలో ఓటర్ల చేర్పులు, వలసలు వెళ్లిన వారు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, డబుల్ ఎంట్రీలపై దృష్టి సారించాలని సూచించారు. బీఎల్‌ఓలంతా లక్ష్యాలను పూర్తి చేసి ఐదు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎస్కే రాజును ఆదేశించారు. ఎవరి నుంచైనా ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. రాజాం నియోజకవర్గంలోనే బీఎల్‌ఓలు వెనుకంజలో ఉన్నారని, వారంతా లక్ష్యాలు చేరుకునేలా చూడాలని ఆర్‌ఓ సుధారాణిని ఆదేశించారు. జూనియర్ కళాశాలలో నాడు – నేడు కింద పనులు త్వరగా పూర్తి చేసి పోలింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉరిటి జగదీశ్వరరావుకు సూచించారు. కలెక్టర్ వెంట ఈడీటీ ప్రకాష్‌రాజు, ఆర్ఐ విద్యాసాగర్ ఉన్నారు.

నూర్చిన ధాన్యం వెంటనే కొనుగోలు : కలెక్టర్

విజయనగరం అర్బన్: తుపాను పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి కోతలు వాయిదా వేయాలని, నూర్చిన ధాన్యం వెంటనే కొనుగోలు కోసం సమీప ఆర్‌బీకేలను సంప్రదించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రైతులకు ఆదివారం విజ్ఞప్తి చేశారు. చేను కోత కోసిన పరిస్థితి ఉంటే తప్పనిసరిగా కుప్పలుగా వేసుకోవాలని సూచించారు. వీలున్నంత వరకు ప్లాస్టిక్ షీట్‌లో లేదా టార్పాలిన్లతో కప్పి ఉంచుకోవాలని కూడా సూచించారు. జిల్లాలో సాగు చేసిన 2.31 లక్షల ఎకరాల వరి సాగులో 66 శాతం 1.53 లక్షల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని వివరించారు. ఈ ఏడాది 2,817 ఎకరాల మేరకు పంట మార్పిడి జరిగిందని దీనిని వెంటనే ఆర్‌బీకే ద్వారా కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు తమ దగ్గర ఉన్న నూర్పిడి చేసిన ధాన్యాన్ని సంబంధిత రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్‌కి తెలియజేసి ధాన్యం కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 4వ తేదీ నుంచి జిల్లాలో ఒక మోస్తరు వర్షపాతం అలాగే ఐదు, ఆరు తేదీల్లో అధిక వర్షపాతం నమోదయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. ఈ పరిస్థితిలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రకటించారు. ఎలాంటి సమస్యలైనా.. రైతులు కంట్రోల్ రూం 89789 75284 నంబరుకు సంప్రదించాలని సూచించారు.